వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
బుధవారం 30 సెప్టెంబరు 2026

# ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలి

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జె. రమేష్



భద్రాచలం, సెప్టెంబర్ 29 : ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ మాట్లాడుతూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగే విధంగా ఎన్నికల సంఘం వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తాయని అన్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై వస్తున్న ఆరోపణలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కూడిన స్వతంత్ర విచారణ చేపట్టాలని ఏజే రమేష్ కోరారు. విచారణ ద్వారా వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో తొలగించిన పేర్లపై పూర్తిస్థాయి పరిశీలన చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీపీఐ(ఎం) కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే ఎన్నికల సంఘం తన నిర్ణయాలు చట్టపరమైన ప్రక్రియలోనే జరుగుతున్నాయని, అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉండటం సంస్థాగత ప్రక్రియలో భాగమేనని చెబుతోంది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, సున్నం గంగా, ఎర్రంశెట్టి వెంకట్రామారావు, డి సీత లక్ష్మి, మచ్చ రామారావు, కొలగాని రమేష్, ఉస్తెల జ్యోతి, కనక శ్రీ పాల్గొన్నారు.



## వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ అధికారిక పర్యటన

### బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యం సహకారంతో సరస్వతి మాత విగ్రహా కట్ట ఏర్పాటుకు జిల్లా గవర్నర్ చే భూమి పూజ

### పాఠశాల మొత్తం విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్కులు,పెన్నులు, పెన్సిళ్ళు,రబ్బరులు షాప్నర్లు స్కేలు పంపిణీ

మక్తల్ సెప్టెంబర్ 29 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ పట్టణ కేంద్రంలో మక్తల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బ్రిలియంట్ స్కూల్ నందు వాసవి క్లబ్ జిల్లా వి 108 గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా.. మొదటగా సరస్వతి మాత ఫోటోకు ముఖ్య అతిథి గవర్నర్ గారిచే, అతిథులు రీజన్ చైర్మన్, సెక్రెటరీ, జెడ్ సి , వాసవి క్లబ్ సభ్యులచే పూజ చేసిన, అనంతరం జిల్లా గవర్నర్ గోల్డెన్ స్టార్ కేసీజీఎఫ్ కల్మచర్ల రమేష్ సార్ చేతుల మీదుగా బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యం వారి సహకారంతో సరస్వతి విగ్రహానికి కట్ట చేయుట కోసం భూమి పూజ చేయడం జరిగింది. అలాగే ముఖ్య అతిథి జిల్లా వి 108 ఏ గవర్నర్ గోల్డెన్ స్టార్ కె సి జి ఎఫ్ కల్మచర్ల రమేష్, అతిథులు రీజియన్ చైర్మన్ ప్రతిభా సంకల్పం కే సి జి ఎఫ్ శ్రీకర్ నాగ సావిత్రి, రీజన్ సెక్రెటరీ నీలకాంత్, జెడ్ సి బెండె సత్యవతి, ప్రిన్సిపల్ సుజిత రెడ్డిచే విద్యార్థిని విద్యార్థులకు నోట్బుక్కులు, పెన్నులు పెన్సిళ్లు రబ్బరులు మాగనూరు ఆర్యవైశ్య సంఘం సభ్యులచే, అలాగే ముఖ్యఅతిథి, అతిథులు,మక్తల్ మాజీ డిప్యూటీ గవర్నర్లు, వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి,కోశాధికారి సభ్యులచే విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ గవర్నర్ కల్వ శ్రీనివాస్,కాబినెట్ నాగరాజు,మాజీ కె సి జి ఎఫ్ అధ్యక్షులు బిలకంటి నర్సయ్య, బిలకంటి జగదీశ్, ప్రిన్సిపల్ సుజిత రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి, పిఈటి బాలరాజ్, వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ, కార్యదర్శి కొత్త ఆంజనేయులు, తాళంపల్లి పవన్ కుమార్,పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థుల అభ్యున్నతికి అంబేద్కర్ యూనివర్సిటీ వరం

**– ప్రొఫెసర్ డా. బి. ధర్మానాయక్**

హుజూర్ నగర్: సెప్టెంబర్,29 (వాయిస్ టుడే ప్రతినిధి): పేద విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసి స్వయం ఉపాధి అవకాశాలను,పెంపొందించేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓవరం లాంటిదని బిఆర్ఎఓయూ ఎక్స్టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి ప్రొఫెసర్ డా"బి.ధర్మా నాయక్ అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో నిర్వహించిన కౌన్సిలర్ల సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరవిద్య ద్వారా లభిస్తాయని అన్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తోందని, మహిళా విద్యార్థినులకు విహబ్ ద్వారా వ్యాపారాభివృద్ధి, ఆవిష్కరణలు, నైపుణ్య శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్ లైన్ లెర్నింగ్ పద్ధతి లో ప్రపంచంలో ఎక్కడనుంచైనా తెలుగు ,ఇంగ్లీష్ మాధ్యమాల్లో పీజీ , ఎంబి ఏ చేసే అవకాశం అంబేద్కర్ యూనివర్సిటీ లో మాత్రమే ఉందని వివరించారు . యూనివర్సిటీ టీసీఎస్, ఐకాన్, రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్, రాశి, విహబ్ వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుందని తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు అన్నారు. 2026 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతు న్నాయని, అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్,30 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాంకేతికతను వినియోగించి విద్యను మరింత సులభతరం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ రామారావు, కో ఆర్డినేటర్ ఎస్ బాలరాజు , సైదా నాయక్ , అధ్యయన కేంద్ర కౌన్సిలర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## మన జర్నలిస్టుల హక్కులకై పోరాడుదాం

### జిల్లా తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)సెప్టెంబర్ 29: నిర్మల్ జిల్లా తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎ నుగందుల సతీష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం హక్కుల పరిరక్షణ జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కమిటీ ఏర్పాటు ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ పనిచేయడానికి కాదని రాష్ట్రంలో జర్నలిస్టులకు దక్కవలసిన గౌరవం కోల్పోతున్నారని హక్కులు మరియు సముచిత ప్రాతినిధ్యం కోసం జిల్లా జర్నలిస్ట్ లు అందరు ముఖ్యంగా 3 ఎమ్మెల్సీ స్థానాల విషయంలో హక్కును సాధించేందుకు ఐక్యంగా, నిబద్ధతతో పోరాడేందుకు ఈ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.

కాబట్టి జర్నలిస్టుల హక్కుల కోసం నిజంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్న ప్రతి ఒక్కరు ఈ కమిటీ ద్వారా కలసికట్టుగా ఒక వేదికగా మన బావాలను వ్యక్తపరిచి, పదవుల కోసం పోటీకి అతీతంగా జర్నలిస్టుల ప్రయోజనమే ఏకైక లక్ష్యంగా పనిచేయడం మన కమిటీ ప్రధాన ఉద్దేశ్యం. కాబట్టి పలుగురు విలేకరులు కొన్ని సంవత్సరాలనుండి యాడేసిన గొంగడి ఆడే ఉంది అన్నట్టు ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన సరియైన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే అందరి సహకారంతో ఎలాంటి వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా, నిజాయితీ, పారదర్శకత, సమిష్టి నిర్ణయం మరియు క్రమశిక్షణతో ఒకరి కోసం కాదు.ప్రతి జర్నలిస్టు కోసం, ఒక పదవి కోసం కాదూ జర్నలిస్టుల హక్కుల కోసం. వ్యక్తిగత స్వార్థం కోసం కాదు సుమా జర్నలిజం గౌరవం కోసం. అందరం ఒకే లక్ష్యంతో, ఒకే మాటపై, ఒకే దిశలో ముందుకు సాగుతూ జర్నలిస్టుల హక్కులను సాధించే వరకు ఐక్యంగా పోరాడటమే ఈ కమిటీ సంకల్పం. కావున ప్రతీ విలేకరి కాలు కదల్చి ముందుకు వచ్చి జర్నలిజం సత్తా ఎంటో చూపించే సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోగరని మనవి. మరో కొన్ని రోజుల్లో వేసే కమిటీ లో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని, రాష్ట్ర కమిటీ సూచల మేరకు ముందు కెళ్దాం అన్నారు.



## రేజింతల్ సిద్ధి వినాయక ఆలయ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన

### భక్తుల రద్దీ దృష్ట్యా పటిష్ట బందోబస్తు

### సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

జహీరాబాద్, వాయిస్ టుడే, సెప్టెంబర్ 29: అంగారక సంకష్టహర చతుర్థి సందర్భంగా రేజింతల్‌లోని సిద్ధి వినాయక ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆలయాన్ని సందర్శించి భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో భక్తుల రాకపోకలు, క్యూలైన్ల నిర్వహణ, వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు.?భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. భక్తులు పోలీసులకు సహకరిస్తూ, క్రమశిక్షణతో క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకుని ప్రశాంతంగా వెళ్లేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్, రూరల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతు, ఎస్సైలు సుజిత్, ఝరాసంగం క్రాంతి పాటిల్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కొల్లూరులో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన

### అర్హులైన ప్రతి ఒక్కరికీ పేదల ఇంటి కలను నెరవేరుస్తాం: సర్పంచ్ శివరాజ్

జహిరాబాద్ వాయిస్ టుడే, సెప్టెంబర్ 29: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఝరాసంగం మండలం కొల్లూరు గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గ్రామ సర్పంచ్ చింతలగట్టు శివరాజ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటికే 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అవి నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. తాజాగా మరో 3 ఇళ్లు మంజూరయ్యాయని, మరో 6 ఇళ్లు మంజూరు కావాల్సి ఉందన్నారు. రానున్న రెండో విడతలో గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన



భద్రాద్రి: అన్నపురెడ్డిపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కొనసాగుతోన్న భూ రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా నరసాపురం గ్రామ పరిధిలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్.. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. బియ్యం, పప్పులు తదితర నిత్యావసర సరకుల నిల్వలను తనిఖీ చేసి నాణ్యత, నిల్వ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం కల్పిస్తున్న ప్రతి సౌకర్యం, పథకం పూర్తి స్థాయిలో వారికి అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు.




## నిర్మల్ ట్రామా సెంటర్‌ను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలి

### మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి డిమాండ్

నిర్మల్, సెప్టెంబర్ 29 (వాయిస్ టుడే): నిర్మల్ జిల్లా ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలో రూ.23.75 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ (ట్రామా) సెంటర్‌ను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2023--24 సంవత్సరంలో మంజూరైన ట్రామా సెంటర్ నిర్మాణ పనులు ఆరు నెలల క్రితమే పూర్తయినప్పటికీ ఇప్పటివరకు ప్రారంభించకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన సమయంలో ప్రజలకు ఉపయోగపడాల్సిన ట్రామా సెంటర్ ప్రారంభంలో జాప్యం చేయడం సరికాదన్నారు.

స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు అడ్డంకిగా మారారని, కమిషన్ల కోసమే పనులను అడ్డుకుంటున్నారని ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశంలో రాజకీయాలకు తావు లేకుండా తక్షణమే ట్రామా సెంటర్‌ను ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఇంద్రకరణ్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా ప్రధాన ఆసుపత్రి నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, గ్రంథాలయ చైర్మన్ అర్జుమాన్ అలీ, ఎఫ్ఎస్ఏసీఎస్ చైర్మన్ ధర్మజీ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, స్థానిక జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**